
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 24 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (ఆది)	సా.6.24
	సహరి (సోమ)	ఉ.4.42

అన్నవరంలో నేటినుంచి ఆర్జితసేవగా సత్యదేవుడి రథసేవ - 7లో

ఘనంగా యానాం వెంకన్న రథోత్సవం

అంతా ఓకే!

- కోనసీమ జిల్లా పి.గన్నవరంలో రాజకీయ ఉత్కంఠకు తెర
- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధికారిక ప్రకటన
- జోష్‌లో ఉన్న గన్నవరం నియోజకవర్గ కూటమి శ్రేణులు
- ఉమ్మడి తూర్పుగోదావరిలో అన్ని సీట్లకు అభ్యర్థులు ఖరారు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయపరంగా ఉత్కంఠ రేపిన పి.గన్నవరం రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పోటీ చేస్తున్నట్టు ప్రకటించింది. స్వయంగా జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణే ఈ ప్రకటన చేశారు. నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును శనివారం ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి విడత జాబితాలో పి.గన్నవరం స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. అయితే రాజేష్ అభ్యర్థిత్వం పట్ల వ్యక్తమైన అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని మార్పు అనివార్యమైంది. టీడీపీ ఖాతాలో ఉన్న ఈ సీటు వ్యూహాత్మకంగా జనసేనకు దక్కింది. టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ యూట్యూబ్ చానల్‌లో గతంలో టీడీపీ, జనసేన, హిందూ కులాలకు వ్యతిరేకంగా చేసిన వీడియోల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ ప్రజలు, ఆయా పార్టీల కేడర్ వ్యతిరేకించడంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీకి నష్టం కలగకూడదనే సదుద్దేశంతో మహాసేన రాజేష్ స్వచ్ఛందంగా తానే గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిత్వం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటన చేశారు. పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా టీడీపీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన స్వచ్ఛంద ప్రకటన సారాంశం. అయితే తరువాత తన నిర్ణయం పట్ల పార్టీ నుంచి ఎటువంటి స్పందన వెలువడకపోవడంతో మళ్లీ పోటీ చేసేందుకు రాజేష్ సిద్ధంగా ఉన్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పి.గన్నవరం అభ్యర్థిత్వం ఆటలాడుకుందనే చెప్పాలి. ఆయా పార్టీలకు చెందినవారు ఆ నియోజకవర్గం నుంచి తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తూ నియోజకవర్గ ఓటర్లను గందరగోళంలో ముంచెత్తారు. టీడీపీ నుంచి కొందరు. బీజేపీ నుంచి టీఎస్ఎన్ మూర్తి, మానేపల్లి అయ్యాజీవేమాల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తింది. అయితే గన్నవరం సీటు పైనే ఆశలు పెట్టుకుని పోలీసు శాఖలో చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణచేసి జనసేనలో చేరిన గిడ్డి సత్యనారాయణ పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నాన్ని కొనసాగించడంతో చివరకు విజయం సాధించారు. టీడీపీ స్థానంలో జనసేన నుంచి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం చేసిన ప్రకటనతో ఈ నియోజకవర్గంపై అటు టీడీపీ, ఇటు బీజేపీలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. దాంతో జనసేన కేడర్‌లో ఆనందం పెల్లుబికుతోంది. పైగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న జనసేన విజేతల సమాచారాన్ని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తం చేయడంతోపాటు వారు పార్టీ కోసం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకుని గన్నవరం స్థానం నుంచి జనసేన అభ్యర్థిని పోటీలోకి పెడుతున్నామని, మీరంతా కష్టపడి పనిచేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మొత్తం మీద తొలి జాబితాలో టీడీపీ ప్రకటించిన స్థానాన్ని జిల్లాలో చిట్టచివరి స్థానంగా జనసేన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ క్రమంలో అభ్యర్థుల బలాబలాలపై తాజా చర్చ మొదలైంది.



పి.గన్నవరం అభ్యర్థి గిడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న పవన్

పి.గన్నవరాన్ని పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా అందిస్తా

- జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సహకారంతో పి.గన్నవరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి జనసేనాని పవన్‌కల్యాణ్ గిఫ్ట్‌గా అందిస్తా. నామీద నమ్మకంతో సీటు కేటాయించిన పవన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. జనసేన అధినేత ఆశయాలతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రతి నిరుపేదకు అండగా నిలుస్తాను. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

అభ్యర్థి వివరాలివీ..

గిడ్డి సత్యనారాయణ స్వగ్రామం పి గన్నవరం మండలం ఊడిమూడి శివారు ఊడిమూడిలంక. బీఏ, బీఎల్ చదువుకున్న ఆయన హైదరాబాదు సిటీ కమిషనర్ కార్యాలయంలో 20 ఏళ్లుగా అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయపరంగా 1989లో తెలుగు యువత జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఇటీవల జనసేనలో చేరిన ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంలోని అన్ని సీట్లకు అభ్యర్థులను టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించింది. తొలి సీటును మండపేట నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారు. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును తమ అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజానగరం నుంచి తమ పార్టీ పోటీ చేస్తున్నట్టు తొలిసారిగా ప్రకటించారు. ఆ తర్వాత విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ రాగా చివరిగా శనివారం పి గన్నవరం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను పవన్ ప్రకటించడంతో అన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. ఇక పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లు ఉండగా, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో పశ్చిమగోదావరి నుంచి కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీట్లు వచ్చి చేరాయి. అంటే రంపచోడవరంతో కలిపి 22 సీట్లు అయ్యాయి.

మొత్తం అసెంబ్లీ సీట్లు : 22
ఉమ్మడిగా సీట్ల పంపకం..
తెలుగుదేశం : 16, జనసేన : 6

వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

- కాకినాడ రూరల్‌లో ఆత్మీయ సమావేశాన్ని అడ్డుకున్న అధికారులు
- ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, పిల్లి అనంతలక్ష్మి ఆగ్రహం



జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో అధికారుల వాగ్వాదం

సర్పవరం జంక్షన్, మార్చి 23: ప్రజలు ఎవరూ ఓట్లేయడానికి బయటకు రాకుండా పోలీసులతో ఎన్ని ఆటంకాలు సృష్టించి ఎన్ని జిమ్మిక్కులు చేసినా అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. ఎన్నికల సమాయత్తంలో భాగంగా తిమ్మాపురంలోని బీజేపీ జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు నివాసంలో ఉమ్మడి పార్టీ ముఖ్యనాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇంతలో తిమ్మాపురం ఎస్ఐ ఎంపీపీ రవీంద్రబాబు, ఎంపీడీవో రమేష్‌నాయుడు ఇంట్లోకి వచ్చి సమావేశం పెట్టేందుకు అనుమతి ఉందాఅని ప్రశ్నించడంతో నాయకులు ఖంగుతిన్నారు. మిత్రపక్షమైన బీజేపీ మద్దతు కోసం మాట్లాడేందుకు వస్తే దీనికి ఎన్నికల సంఘం అనుమతులు ఉన్నాయా అంటూ ప్రశ్నించడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడేమీ బహిరంగ సభ పెట్టలేదని, ముఖ్యనాయకులతో మాట్లాడుకుంటున్నామని ఇక్కడికి మీరు రావాల్సిన అవ సరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. అనుమతి లేకుండా బయట సమావేశం పెట్టారని గ్రామ సెక్రటరీ ఫిర్యాదు చేయడంతో వచ్చినట్లు ఎస్ఐ బదులివ్వడంపై పార్టీ నాయకులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇంటి బయట స్థలంలో రాజకీయ సమావేశాలు, సభలు పెడితే గుర్తుకు రాని ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రతిపక్ష అభ్యర్థులు ఇంట్లో కూర్చుని మాట్లాడుతుంటే నిబంధనలంటూ వేధింపులకు పాల్పడతారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, అవరోధాలు కల్పించినా ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం చంద్రబాబు సీఎం కావడం, నానాజీ ఎమ్మెల్యే విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి అన్నారు.

పోరాడి గెలవండి

- అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అక్రమాలు, అరాచకాలపై అప్రమత్తంగా ఉండాల్సిందే
- ఆ పార్టీ రౌడీయిజం, దౌర్జన్యాలు, అధికార దుర్వినియోగంపై గట్టిగా పోరాడండి
- ఎమ్మెల్యే అభ్యర్థులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో చంద్రబాబు దిశానిర్దేశం
- జిల్లా నుంచి హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థులు రాజప్ప, నెహ్రూ, కొండబాబు, దివ్య, సత్యప్రభ
- నామినేషన్ల దాఖలు సమయంలో ఏమాత్రం ఏమరపాటొద్దని హెచ్చరిక
- పొత్తులవల్ల టికెట్ ఇవ్వనివారికి పదవులతో గౌరవిస్తామని హామీ
- పిఠాపురం, కాకినాడ రూరల్, ఎంపీ సీటు ఆశావహుల్లో ధైర్యం నింపిన బాబు
- నాలుగైదు సర్వేలు, ఐవీఆర్ఎస్ చేయించిన తర్వాతే టికెట్లు ప్రకటించామని సుస్పష్టం
- చంద్రబాబును కలిసిన వర్మ.. పవన్ విజయం కోసం సమష్టిగా పనిచేయాలని ఉద్బోధ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా నేతలకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ దగ్గరపడే కొద్దీ అధికార వైసీపీ అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, రౌడీయిజం మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇవన్నీ తట్టుకుని నిలబడి గెలవాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంపికైన నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం అమరావతిలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి, అభ్యర్థుల హక్కు, వైసీపీ కుట్రలను ఎదుర్కోవడం, ఎన్నికల్లో ప్రచారం, నామినేషన్ల దాఖలుతో వ్యవహరించాల్సిన తీరు తదితర అంశాలపైనా కూలంకుషంగా చర్చించడం తోపాటు సూచనలు, సలహాలు అందించారు. జిల్లానుంచి సీట్లు దక్కించుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే రాజప్ప, జగ్గంపేట, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, తుని, ప్రత్తిపాడు ఇన్‌ఛార్జులు దివ్య, వరుపుల సత్యప్రభ ఈ వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పాత, కొత్త అభ్యర్థులను ఉద్దేశించి పలు కీలక అంశాలపై చంద్రబాబు ప్రసంగించారు. సీట్లు దక్కించుకున్న అభ్యర్థులను ఎంపిక చేసిన విధానం దగ్గరనుంచి బాగా పనిచేసినా పొత్తుల కారణంగా టికెట్లు రాని అభ్యర్థులను ఆదుకోవడం వరకు అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.





అమరావతిలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, సమన్వయకర్తలు

అప్రమత్తంగా లేకపోతే నష్టపోతాం

మరికొద్దిరోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. అధికారపార్టీ నాయకులు అడ్డదారుల్లో గెలవడానికి చూస్తున్నారని, దీన్ని ఎప్పటికప్పుడు పసిగడుతూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ప్రధానంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆ పార్టీ నేత లు పోలింగ్ దగ్గరపడే కొద్దీ మరింత రౌడీయిజం, అధికార దు ర్వినియోగం చేస్తారని హెచ్చరించారు. దీన్ని సమర్థవంతంగా తిప్పికొట్టకపోతే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఒక రకంగా చెప్పాలంటే జిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు పోలింగ్ పూర్తయ్యే వరకు పోరాటమే ఊపిరిగా ముందుకు సాగాలనే సంకేతాలు పంపారు. ఏ చిన్న ఏమరపాటుగా ఉన్నా అధికారం అండతో ఆధిపత్యం చెలాయించే ముప్పుఉందని వివరించారు. తద్వారా కాకినాడ సిటీ, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో పొంచిఉన్న ముప్పును ముందే ఆయా అభ్యర్థులకు హెచ్చరించినట్లయింది. ఈ ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి గెలవడం ఎంత అవసరమో, అందు కోసం ఏ స్థాయిలో కష్టపడాలి అనేది విశ్లేషించి చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలవకముందే అధికార పార్టీ ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో దొంగ ఓట్లను భారీగా చేర్పించిందని దీనిపైనా ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. వాస్తవానికి ఇప్ప టికే జిల్లాలో కాకినాడ సిటీ, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర నియోజక వర్గాల్లో వేలాది దొంగ ఓట్లు ఉండిపోయిన నేపథ్యంలో ఆయా అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాల్సిన విధానాన్ని సూచించారు. కాగా జనసేనతో పొత్తు కారణంగా కొందరికి టికెట్లు ఇవ్వలేకపోయామని వివరిస్తూనే పార్టీలో ఈ ఐదేళ్ల పోరాడిన వారు చాలామంది ఉన్నారని గుర్తుచేశారు. అందుకే సీటు రాని అభ్యర్థుల బాగోగులను చూసుకుంటామని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భవిష్యత్తులో పదవులు ఇచ్చి న్యాయం చేస్తామనే ధీమా కల్పించారు. వాస్తవానికి జిల్లాలో పిఠాపురం, కాకినాడ సీట్లు పొత్తులో భాగంగా జనసేనకు వెళ్లిపోయాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మికి అవకాశాల్లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో అటువంటి వారికి న్యాయం చేస్తామనే ఆశ కల్పించారు. ఇప్పటికే వర్మకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ ఇస్తామని చంద్రబాబు బహిరంగ హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం వర్మ అమరావతిలో చంద్రబాబును కలిశారు. పార్టీ కోసం నియోజకవర్గంలో ఏవిధంగా పనిచేస్తోందీ, కమిటీల వారీగా పార్టీ తరపున చేపడుతున్న కార్యక్రమాలపై నివేదిక అందించారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పవన్‌కళ్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, అంతా కలిసికట్టుగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. జిల్లానుంచి ఐదు సీట్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులను ఎంపిక చేసేముందు భారీ కసరత్తు చేసినట్లు వివరించారు. పార్టీపరంగానే కాకుండా సొంతంగా ఓట్లు వేయించుకునే సామర్థ్యం ఉన్నఅభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. తాను నాలు గైదు సర్వేలు చేయించానని, ఐవీఆర్ఎస్ కూడా చేపట్టి అన్ని కోణాల్లో గెలిచే సత్తా ఉందో లేదో గుర్తించి సీట్లు ఇచ్చినట్లు వివరించారు. ప్రతిఒక్కరు కష్టపడి పనిచేయాలని చెప్పారు. నామినేషన్ల దాఖలు గడువు వరకు ప్రతి అభ్యర్థి పనితీరును సమీక్షిస్తానన్నారు. ఏమాత్రం తేడా ఉన్నా మార్పు తప్పదని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23: వేసవి దృష్ట్యా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ, కరువు మండలాలు, వేసవిలో తాగునీటి సమస్యపై సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనుల లేబర్ కాంపో నెంట్ పెంచాలని కలెక్టర్ కోరారు. ఈ ఆర్థిక సంవత్స రానికి అనుగుణంగా పనుల పురోగతి కనబర్చుతామన్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువ నమోదవుతున్నందున తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీనివాసు పాల్గొన్నారు.

బాలల ఉపకరణాల పంపిణీకి పరీక్షలు..

కోడ్ పరిధిలోకి రాదా?

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23: చెవిటి, కంటి, ఎముకల సమస్యలు ఉన్న బాలలకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు పరీక్షలు చేయడం ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదా అనే అంశంపై అధికారులు పరిశీలించాల్సి ఉంది. సమగ్ర శిక్షా కాకినాడ, సహిత విద్యా విభాగం సంయుక్తంగా ఈనెల 28నుంచి వచ్చేనెల 4 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో బాలలకు ఉపకరణాల పంపిణీ నిమిత్తం వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు చేసి వైకల్యాన్ని నిర్ధారించాలని నిర్ణయించారు. దీని నిమిత్తం బాలల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పరీక్షల తర్వాత ఎంతమేరకు పరికరాలు అవసరమో ఆ మేరకే మంజూరవుతాయి. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున జిల్లా ఎన్నికల అధికారులు దీనిపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉందని నాయకులు అంటున్నారు.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23: ప్రసార మాధ్యమాల్లో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు పెయిడ్ న్యూస్‌ను పర్యవేక్షిస్తుందన్నారు. రిజిస్టర్ చేసిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రకటనలకోసం మానిటరింగ్ కమిటీకి మూడురోజులు ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. ఇతర వ్యక్తులైతే వారంరోజులు ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. పోలింగ్‌రోజు, పోలింగ్ ముందురోజు ప్రకటనలకు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్‌ప్లే, మొబైల్ నెట్‌వర్క్, ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయన్నారు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్లు, వికీపీడియాలు కూడా ఈ పరిధిలోకి వస్తాయని చెప్పారు. సినిమాహాలు, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో, పత్రికల్లో ప్రచురితమయ్యే వాటికి అనుమతులు తీసుకోవాలన్నారు. మోనిటరింగ్ కమిటీ అనుమతి తీసుకోకుండా ప్రకటనలు జారీచేస్తే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీరు

- విధులనుంచి తొలగించిన అధికారులు

రౌతులపూడి, మార్చి 23: రౌతులపూడిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరును అధికారులు విధులనుంచి తొలగించారు. ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుతో స్థానిక వలంటీరు గొంపా గోవింద్ ప్రచారంలో పాల్గొన్నాడు. ఎన్నికల ప్రవర్తన నియమావళి లోభాగంగా విధులనుంచి అతడ్ని తొలగిస్తూ మండల పరిషత్ కార్యాలయంనుంచి శనివారం ఉత్తర్వులు జారీచేశారు.



వరుపులతో ప్రచారంలో పాల్గొన్న వలంటీరు గోవింద్



కాకినాడ నుంచి అరుణాచలం వెళ్తున్న బస్సు

అరుణాచలం బయలుదేరిన స్పెషల్ బస్సు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 23: కాకినాడ నుంచి శనివారం అరుణాచలం యాత్రకు సూపర్‌లగ్జరీ స్పెషల్ బస్సు బయలుదేరింది. ఈ బస్సు మూడు రోజులు యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి తిరిగి 26న కాకినాడ వస్తుందని డిపో మేనేజర్ తెలిపారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి చూపిస్తారని ఆయన చెప్పారు.



ఓటు నమోదుకు ఇంకా అవకాశం

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం, అలాంటి ఓటు ఉందో లేదో ఒక్కసారి ఓటర్ల జాబితాలో చూసి పరిశీలించుకోవాలి. ఓటు ద్వారానే ప్రజలకు మేలు చేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలం. ప్రజాస్వామ్యంలో నిరంకుశత్వవాదులను తరిమికొట్టాలంటే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. కాకినాడ జిల్లాలో 16 లక్షల 11 వేల మంది ఓటర్లు ఉన్నారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే అవగాహన లేకపోవడం వలన ఇప్పటికీ కొంతమంది ఓటు ఉందో లేదో పరిశీలించుకోలేకపోతున్నారు. అలాంటి వారి కోసం ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున ఇక నుంచి జాబితా నుంచి ఓట్ల తొలగింపు, మార్పులకు అవకాశం లేదు. కేవలం కొత్తగా నమోదుకు మాత్రమే అవకాశం కల్పించారు. అయితే ఓటర్ల జాబితాలో ఓటు లేనివారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు.



www.nvsp.in వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. రిజిస్టర్ యాజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేసిన అనంతరం ఫాం 6 దరఖాస్తు ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే ఆన్‌లైన్ దరఖాస్తు కనిపిస్తుంది. దానిలో అడిగిన వివరాలు నింపి సబ్‌మిట్ కొట్టాలి. ఆ తర్వాత ఫోన్ నెంబర్‌కు రిఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి ఇంటి అడ్రస్‌కు వచ్చి పరిశీలిస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు.



ప్లేస్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి చెందిన ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మీ ఫోన్ నెంబర్ వివరాలు పొందుపర్చి రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత లాగిన్ అయ్యి ఓటర్ రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళితే న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తు నింపి సబ్‌మిట్ చేయాలి. https://voterportal.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యి వెబ్‌సైట్‌లో ప్రవేశించిన తర్వాత న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ అనే విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తులో వివరాలు నింపి సబ్‌మిట్ చేయాలి.

ఫారం 6 సమర్పించాలి

ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వారు బూత్‌స్థాయి అధికారులకు ఫారం 6 దరఖాస్తు సమర్పించాలి. అలాగే ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. వారికి కూడా దరఖాస్తులను సమర్పించవచ్చును. అలాగే ప్రతి మండలంలో తహసీల్దార్ గానీ డిప్యూటీ తహసీల్దార్‌ను గానీ సంప్రదించి దరఖాస్తులను ఇచ్చి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్న 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చును.

- ఏప్రిల్ 15వతేదీ వరకు నమోదు
- ఒక్కసారి ఓటు ఉందో.. లేదో
- పరిశీలించుకోండి
- ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటే
- ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితా
- పరిశీలించుకోవాలి
- నేరుగా అధికారులకు దరఖాస్తు
- ఆన్‌లైన్‌లోనూ సులువుగా నమోదు

కొత్తగా నమోదు చేసుకోండి

రామ్‌సుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా



ఇప్పటికీ కూడా ఎవరిదైనా ఓటు జాబితాలో లేకపోతే కొత్తగా నమోదు చేసుకోవచ్చునని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి చెప్పారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. అయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు ఇక లేవన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చునని వెల్లడించారు. దీని కోసం జిల్లాతో పాటు మండల స్థాయిలో కూడా ఎన్నికల అధికారులను సంప్రదించాలన్నారు.



గోవిందా..గోవింద

భక్తజన సంద్రంగా మారిన వాడపల్లి

ఆత్రేయపురం, మార్చి23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రమైంది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 42 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 20 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.48.82 లక్షలు లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి



అల్లవరం, మార్చి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌లో టాటా సంస్థ స్టోర్ ఇన్‌చార్జి కొల్లు వెంకటరమణరావు (55) వడదెబ్బకు మృతిచెందాడు. ఓడలరేవుకు చెందిన ఆయన శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 3.30గంటలకు స్టోర్ నుంచి కిలోమీటరు నడిచివెళ్లి కుప్పకూలిపోయాడు. టాటా సిబ్బంది అతడిని బెండమూర్లంక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. టీడీపీ నేత, మాజీ సర్పంచ్ కొల్లల సత్యనారాయణమూర్తి తనయుడు ఈయన.

నేటి నుంచి ఆర్జిత సేవగా రథసేవ

అన్నవరం, మార్చి 23: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం నుంచి నూతనంగా మరో ఆర్జితసేవను ప్రవేశపెట్టనున్నారు. ఇటీవల చేయించిన నూతన రథంపై స్వామి, అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. అయితే దీనిని ఆర్జిత సేవగా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆమోద ముద్ర వేయడంతో రూ.2500 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. ఈ టికెట్ తీసుకునే భక్తులకు ముందుగా గోత్రనామాలతో పూజలు చేసి స్వామివారి కండువా రవికల వస్త్రం, ప్రసాదం ప్యాకెట్లను అందజేయడంతో పాటుగా నలుగురికి అంతరాలయ దర్శన ప్రవేశం కల్పించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యానాం, మార్చి 23: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అశేష జనవాహినితో యానాం రహదారులు కిక్కిరిసిపోయాయి. కశిరెడ్డి సత్యవీరవెంకన్న, కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణేశ్వరరావు ఉత్సవదారులుగా రథోత్సవం నిర్వహించారు. స్థానిక చిన్న సెంటర్ వద్ద స్వామివారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రతినిధులు, పలువురు ప్రముఖులు శనివారం సాయంత్రం 4.45గంటలకు ప్రారంభించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రథంలో వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త బస్టాండ్‌లో భక్తుల దర్శనార్థం రథాన్ని ఉంచారు. తొలుత చిన్న రథంలో స్వామివారిని ఉంచి యానాం వీధుల్లో ఊరేగించారు. అనంతరం పెద్ద రథంలో స్వామివారిని కొలువుదీర్చి పిల్లారాయ వీధిలో ఊరేగించారు. ఎస్పీ రాజశేఖర్ నేతృత్వంలో సీఐ షణ్ముగం పోలీసు బందోబస్తు నిర్వహించారు.


రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ కిటకిట

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన వీధులు
- గజ వాహనంపై గ్రామోత్సవం
- వైభవంగా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం




తరలివచ్చిన భక్తులు

కోరుకొండ, మార్చి 23: కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో 4వ రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి విచ్చేశారు. కొండపైన, కొండ దిగువున సుమారు 30 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరందరికీ మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదే విధంగా రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 92వ విశిష్టాద్వైత పండిత సభలను భక్తులు సందర్శించారు. 4వ రోజున పరాసర లక్ష్మీనరసింహ భట్టర్‌స్వామి అధ్యక్షతన జరిగిన సభల్లో ఉభయ వేదాంత పండితులు కేశ స్వామి, కేశ తలసాయి స్వామి, పరాసర రఘునాథ భట్టర్‌స్వామి, పరాసర శ్రీ వత్స చిన్న భట్టర్ స్వామి, ఇరగవపు కృష్ణామాచార్యుల స్వామి ఉపన్యసించారు. రామాయణం, మహాభారత, భాగవత, బ్రహ్మసూత్రములు, ఆళ్వారుల దివ్య ప్రబంధంలోని విషయాలను పామరులకు సైతం అర్థమయ్యే విధంగా తెలియజేశారు. లక్ష్మీ నరసింహ స్వామి కళావేదికపై చిన్నారుల ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. సుమారు 20 వేల మందికిపైగా మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో అన్న ప్రసాదం అందజేసినట్లు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు.

గజ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు రాత్రి స్వామి వారు గజ వాహనంపై గ్రామోత్సవం చేశారు. ప్రతిరోజు సాయంత్రం జరిగే నిత్య హోమం, బలిహరణ, సేవాకాలం అనంతరం స్వామి వారిని గజవాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి అశ్వవాహనం గ్రామంలో నాలుగు మాఢ వీధుల్లో విహరించింది. భక్తులు స్వామి వారికి పండ్లు ఫలహారాలు సమర్పించి మంగళనీరాజనాలు అందజేశారు.

వైభవంగా శ్రీ రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

శనివారం రాత్రి 10 గంటలకు రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పర్యవేక్షణలో గొట్టుముక్కుల అన్నమాచార్య కుటుంబ సభ్యులైన ఎస్‌టీపీ వెంకటరమణాచార్యుల స్వామి వెంకటరమణాచార్యులు స్వామి దంపతులచే కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.

'పొన్నాడ'కు నిరసన సెగ

- చొల్లంగి గ్రామంలో అడ్డుకున్న మహిళలు
- మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించిన నేతలు
- ఎదురుతిరిగిన గ్రామస్థులు


పొన్నాడను అడ్డుకున్న మహిళలు

తాళ్లరేవు, మార్చి 23: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు నిరసన సెగలు తగిలాయి. చొల్లంగి మహిళలు శనివారం ఎమ్మెల్యేను అడ్డుకుని ఇతర నియోజకవర్గాల లబ్ధిదారులకు సర్వేనెం.47/3, 4.24 సెంట్లలో ఇండ్లస్థలాలు ఇవ్వొద్దని ఈ స్థలాలను స్థానికులకే ఇవ్వాలని లబ్ధిదారులు 47 రోజులుగా నిరసన దీక్షలు చేసినా ఎమ్మెల్యే కానీ, వైసీపీ నేతలు కానీ ఏవిధంగా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఓట్లు కావాల్సి వచ్చాయా అని ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తన దృష్టికి రాలేదని ఎమ్మెల్యే చెప్పారు. ఎవ్వరికో తమ గ్రామంలో ఇండ్లస్థలాలు ఇచ్చి ఓట్లు మాత్రం మమ్మల్ని అడగడం ఎందుకని నిలదీశారు. ఓట్లు అడిగే అర్హత మీకులేదని అన్నారు. దీంతో ఎమ్మెల్యే, లబ్ధిదారులు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వైసీపీ నాయకులు లబ్ధిదారులను తోలు తీసేస్తామనడంతో మహిళలు వైసీపీ నాయకులపై ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో భయపడిన నాయకులు అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్థానికులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

అండగా నిలిచే పార్టీలకే మా మద్దతు

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం
- 'జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం నిర్ణయం

సర్పవరం జంక్షన్, మార్చి 23: 'జయలక్ష్మి సొసైటీ పాత కార్యవర్గం నిర్వాహకులు ఆర్థిక మోసానికి పాల్పడి ఏప్రిల్ 6వ తేదీకి రెండేళ్లు కావస్తోంది. మోసపోయిన వారిలో 50 మంది బాధితులు చనిపోయారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. బాధితులకు అండగా నిలిచే రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుంది' జయలక్ష్మి సొసైటీ బాధిత సంఘం సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో గల జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎదుట బాధిత సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు, అంగర నరసింహారావు, చిప్పల శంకరం, కృష్ణారావు, పల్లంరాజు, రాజగోపాల్ మాట్లాడుతూ పాత చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అయితే నూతన పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు నిందితుల ఆస్తులు గుర్తించి సీబీసీఐడీ ద్వారా న్యాయస్థానం ద్వారా సీజ్ చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయస్థానం నుంచి త్వరలో అనుమతులు వచ్చేలా కృషి చేయాలన్నారు. 50 మంది బాధితులు చనిపోతే ప్రభుత్వం నయాపైసా నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. సుమారు 300 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయని, అడ్వాన్సుగా బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. బాధితులంతా సుమారు 20 వేల మంది ఉన్నామని, వైజాగ్ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు 7 నియోజకవర్గాల్లో సుమారు 2 లక్షల ఓట్లు తమకు ఉన్నాయన్నారు. ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లో బాధితుల సంఘం నుంచి ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపి నిరసన తెలియజేసి సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు.

అభ్యుదయ రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

దివాన్‌చెరువు, మార్చి 23: ప్రతి ఆర్బీకే పరిధిలో ఐదుగురు అభ్యుదయ రైతులను గుర్తించి వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.విజయాభినందన చెప్పారు. వీఏఏల సహాయంతో వారికి సందేశాలను పంపాలని సూచించారు. దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రాన్ని మారుటేరు పరిశోధన స్థానం అధికారి డాక్టర్ డి.శ్రీనివాస్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరువాక కేంద్రం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని కాలానుగుణంగా రైతులకు చేరవేయడంలో కృతకృత్యులయ్యారని అన్నారు. భవిష్యత్‌లో ఇంకా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు ఏరువాక కేంద్రం మరింత చేరువ కావాలంటే అనుసరించాల్సిన విధానాలను సూచించారు. మారుటేరు పరిశోధనా స్థానం అధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో జిల్లాలో చాలా మంది రైతులు ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాలు ద్వారాను, ఇ-విస్తరణ ద్వారానూ రైతులకు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయాభినందనను ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్తలు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ హైమజ్యోతి ఘనంగా సత్కరించారు.

భద్రాచలానికి తలంబ్రాల బియ్యం


తలంబ్రాల బియ్యాన్ని పంపిస్తున్న భక్తులు

నల్లజర్ల,మార్చి 24: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం ఉభయగోదావరి జిల్లాల్లో రామభక్తుల నుంచి సేకరించిన ఐదు టన్నుల బియ్యాన్ని భద్రాచలం పంపించినట్టు శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి జంగారెడ్డిగూడెం సభ్యులు పేర్కొన్నారు. శనివారం నల్లజర్లలో జెండా ఊపి బియ్యం వాహనాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులకు శ్రీరాముని తలంబ్రాలు అందించే నిమిత్తం తాము ఈ కార్యక్రమం తలపెట్టినట్టు సభ్యులు పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, బిక్కిన శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు చెప్పారు.

శనేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

కొత్తపేట, మార్చి23: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి ప్రతఃకాళ అర్చన అనంతరం సర్వదర్శనములకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.12,79,153 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. విశాఖపట్నానికి చెందిన వాడపల్లి శేసేంద్రభానుప్రకాష్ రెండువేల మజ్జిగ ప్యాకెట్లు, 50 కేజీల దద్ధోజ్యనం భక్తులకు వితరణ చేశారు. అలాగే వృద్ధులు, వికలాంగుల సౌకర్యం కోసం ఉచిత ఆటోను దేవస్థానం ఏర్పాటు చేసింది.


అభిషేకాలు నిర్వహించుకుంటున్న భక్తులు

శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 23: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం లోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ.2,86,700, అన్నదాన విరాళాలు ద్వారా రూ. 60,237 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,720, తులాభారం రూ.300 వెరసి రూ.3,52,957 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ లొంగుబాటు

ఎటపాక, మార్చి3: మావోయిస్ట్ పార్టీకి చెందిన కిష్టారం ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్‌గా వ్యవహరిస్తున్న మడివి ఊరలు అలియాస్ ఊర శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓఎస్డీ కె.మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో సాకిలేరు గ్రామానికి చెందిన ఊర మావోయిస్ట్ పార్టీలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. 2006 సంవత్సరంలో దర్బగుడా గ్రామంలో ఇద్దరు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అలాగే 2006 సంవత్సరంలో బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో ఊర పాల్గొన్నాడని, ఆ ఘటనలో 9 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మృతిచెందినట్లు చెప్పారు. 2007 సంవత్సరంలో ఇంజరం సమీపంలోని చీకకొరుగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అదే ఏడాది కుంట పీఎస్ పరిధిలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇంచార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ సభ్యులు (మావోయిస్టులు) జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మరణించినట్లు చెప్పారు. జనజీవన స్రవంతిలో కలిసిన ఊరకు రూ 4 లక్షల రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు కల్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. సీఐ డి.రామారావు, ఎస్ఐ కె పార్థసారధి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంఖవరం, మార్చి 23: మండలంలోని కత్తిపూడి, కొండవారి పేట, సీతంపేట గ్రామాల్లో ఆదివారం కత్తిపూడి ఫీడర్‌లైన్‌లో ఉన్న చెట్లుకొమ్మలు నరికివేత కారణంగా ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



సామర్లకోట సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పీఎంఎంవీవై నమోదులు తప్పనిసరి : డీఎంహెచ్‌వో

సామర్లకోట, మార్చి 23: ప్రతీ ప్రభుతాసుపత్రిలలో, అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ పీఎంఎంవీవై నమోదులు తప్పనిసరిగా పూర్తిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశించారు. శనివారం సామర్లకోట అమ్మాణమ్మ నాయుడు కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆయన తనిఖీ నిర్వహించారు. అర్బన్ ప్రాంతంలో ప్రజలకు అమలుచేస్తున్న వైద్యసదుపాయాలు, చిన్నారులకు ఇస్తున్న వ్యాధినిరోధక టీకాల అమలుపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వైద్యసేవలను సమగ్రంగా అమలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు తమ కదలికలపై మూమెంట్ రిజిష్టర్ అమలుచేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో వెంట డీపీఎంవో డాక్టర్ బి.సురేఖ, డాక్టర్ ప్రభ, డాక్టర్ భవ్యశ్రీలు పాల్గొన్నారు. వేట్లపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో పలు రికార్డులను పరిశీలించారు. పీఎంఎంవీవై నమోదులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ తరపున అమలు చేస్తున్న పలు వైద్యసేవలపై ఆరా తీశారు. డాక్టర్ హిమవతి పాల్గొన్నారు.

'రైలు ప్రయాణికుల కదలికలపై నిఘా అవసరం'

సామర్లకోట, మార్చి 23: రైలు ప్రయాణికుల కదలికలపై రైల్వే పోలీసుల నిఘా ఎంతో అవసరం అని రాజమండ్రి రైల్వే పోలీస్ డీఎస్పీ ఎల్.మోహనరావు అన్నారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామర్లకోట రైల్వేస్టేషన్ అతిథిగృహంలో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గంజాయి, మద్యం, కొకైన్‌లతో బాటూ అధికంగా బంగారం, నగదు రవాణా చేస్తున్న ప్రయాణికుల కదలికలపై ప్రత్యేక నిఘా అవసరమన్నారు. తరచూ ఆకస్మిక తనిఖీలు చేయాలని, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రత్యేక విచారణలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో గౌస్‌బేగ్, డి.సైదయ్య, అబ్దుల్ మారూఫ్, ఎన్.రవికుమార్, పి.రామకృష్ణ, స్టేషన్ సూపరింటెండెంట్ ఎం. రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

'పంచాయతీ పేరుతో డబ్బులు వసూలు'

గండేపల్లి, మార్చి 23: మండలంలో సూరంపాలెం గ్రామంలో పలువురు పంచాయతీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానిక కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీవాసులు బొట్ల ఆంజనేయులు, ఎలుగుబంటి రామలక్ష్మి, నాగదేవర వెంకటలక్ష్మి, అడపా శ్రీనివాస్ పలువురు శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన వ్యక్తి పంచాయతీలో గృహాల కరెంటుమీటర్లకు పంచాయతీ అనుమతి కావాలన్నా, ఇతర పనులకు అనుమతి కావాలన్నా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పటికే దాదాపు రూ.90వేలు వరకు వసూలు చేశారన్నారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. గత రెండేళ్లుగా ఇదే ఇబ్బంది ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'జనసేన అభ్యర్థుల విజయానికి పనిచేస్తాం'

పిఠాపురం, మార్చి 23: జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పని చేస్తామని జనసేన నియోజకవర్గ నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్‌ను శ్రీధర్ కలిసి అభినందనలు తెలిపారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను, ఎంపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మాజీ సర్పంచ్‌లు గరగ సత్యానందరావు, కర్రెడ్ల తాతీలు, ఎలుబండి రాజారావు, కుంపట్ల చెల్లారావు, జవ్వాది జోగేశ్వరరావు, జ్యోతుల సతీష్, వీరంరెడ్డి అమర్, బొజ్జా గోపికృష్ణ, ఇంటి వీరబాబు ఉన్నారు.

'లూథరన్ చర్చి ఆస్తుల సంరక్షణకు కృషి'

సర్పవరం జంక్షన్, మార్చి 23: ఐదున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన లూథరన్ చర్చి ఆస్తుల సంరక్షణకు కృషి చేస్తూ పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ కె.సామ్యూల్, జనరల్ సెక్రటరీ బి.డేవిడ్ తెలిపారు. శనివారం గైగోలుపాడు లూథరన్ చర్చిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘ సభ్యుల సహకారంతో పలు అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టడం జరిగిందన్నారు. కొంత మంది పనికట్టుకుని లేనిపోని ఆరోపణలు చర్చిపై చేయడం శోచనీయమన్నారు. సమావేశంలో కోశాధికారి వీపీఎస్ రెడ్డి, సామ్యూల్, డేవిడ్, దాసరి సాల్మన్ రాజు, చింద్రిపు వినయ్, దాసరి డేవిడ్ జయకుమార్, జేవీఎస్ రమణలు పాల్గొన్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం

గండేపల్లి, మార్చి 23: సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదువుతూ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సన్మాన నిర్వహించారు. వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు వేతనంతో ఒక్కరు రూ.25లక్షలు ఆపై 9మంది, రూ.10లక్షలు ఆపైన 23మంది రూ.5లక్షలు పైన వార్షిక వేతనంతో 147మంది మొత్తంగా 1470 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు డిగ్రీ పట్టాలతో పాటు మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చేలా తీర్చిదిద్ది వారి భవిష్యతకు బంగారు బాటలు వేసిన ఆదిత్య యాజమాన్యం,సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రౌతులపూడి, మార్చి 23: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఏఎల్ఎస్ అధికారి కే.హరికృష్ణ కోరారు. రౌతులపూలో ఎంఈవో కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ తుని, కోటనందూరు, శంఖవరం, తొండంగి బాలిక విద్యాలయాల్లో అర్హులైన విద్యార్థులు ఆరోతరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేజీబీవీలో బడిబయట చిన్నారులు, బడి మానేసినవారు, పేద ఎస్సీఎస్టీ, మైనార్టీ బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింగరంపాలెంలో వాలీబాల్ పోటీలు

గండేపల్లి, మార్చి 23: మండలంలో సింగరంపాలెంలో ఉన్న మందకొండ మాలక్ష్మి అమ్మవారి 24వ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బాబు రాజేంద్రప్రసాద్ మెమోరియల్ జిల్లా స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీలు పెద్ది బాబురావు దివ్య ఆశీస్సులతో ఈనెల 24వరకు ఫ్లడ్‌లైట్స్ వెలుతురులో జరిగే వాలీబాల్ పోటీలను కామినేని జయశ్రీ, జోగి, రాధిక, కోర్పు దుర్గాప్రసాద్, జాస్తి వసంత్ ప్రారంభించారు. పోటీల్లో 24 జట్టులు పాల్గొనగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పీడీ ఎస్.నాగరాజు, శ్రీనివాస్, ఆనంద్, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు, మార్చి 23: జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మి ఆదేశాల మేరకు యర్రవరం రహదారిపై శనివారం స్థానిక సెబ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఏలేశ్వరం నుంచి యర్రవరం వైపు 100లీటర్ల సారా ప్యాకెట్లను పాల కేన్‌లలో లోడ్ చేసి బైక్‌పై రవాణా చేస్తున్న శొంఠిపు శ్రీనును అరెస్ట్ చేశారు. 100లీటర్ల సారా, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ ఎల్.చిరంజీవి, ఎస్ఐ ఎం.ఆశలత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, మార్చి 23: కాకినాడ రూరల్ రమణయ్యపేటలో మోహన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మెడి కవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్రావ్యల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 250 మంది గ్రామస్థులకు ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం మోహన్‌రావు, డైరెక్టర్ వెంకటేష్, ప్రిన్సిపాల్ రాంబాబు, ప్రోగ్రాం మేనేజర్ అభిలాష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉన్నారు.

పదో తరగతి పరీక్షలు

సామర్లకోట, మార్చి 23: పదవతరగతి పరీక్షల్లో భాగంగా సామర్లకోట మండలం, పట్టణం పరిధిలో 9 పరీక్షా కేంద్రాల్లో ఐదోరోజైన శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. 2,001 మంది విద్యార్థులకు గాను 1,879 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని ఆయన చెప్పారు. కాగా సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.శ్రీధర్ తనిఖీలు నిర్వహించారు.

వివాహితను కాపాడిన పోలీసులు

తుని రూరల్, మార్చి 23: తుని రామకృష్ణాకాలనీకి చెందిన ఓ గృహిణి భర్తతో గొడవ పడి నాలుగేళ్ల కుమారుడుతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు తుని రైల్వేస్టేషన్ చేరుకుంది. రైల్వే ట్రాక్ వద్ద అనుమానంగా కనిపించిన ఈ మహిళను రైల్వే పోలీసులు ఆరా తీశారు. దీంతో విషయం తెలియడంతో ఆమె భర్త, తల్లిదండ్రులను పిలిపించి రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఆయన వెంట కానిస్టేబుల్ శ్రీనివాస్, మోహన్‌రావు ఉన్నారు.



వివాహితను భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లుకు ప్రజాసంఘాల నాయకుల ఘన నివాళి



పెద్దాపురంలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కొత్తపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి

కాకినాడ సిటీ, మార్చి 23: దేశ స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిరస్మరణీయులని వక్తలు తెలిపారు. కచేరీపేటలోని శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఏ మాత్రం సంబంధంలేని శక్తులు నేడు దేశాన్ని పాలిస్తున్నాయన్నారు. ఎందరో త్యాగాలతో సాధించుకున్న స్వతంత్ర్య భారతాన్ని ఫాసిస్టు పాలనదిశగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం తీసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రమణమ్మ, నర్ల ఈశ్వరి, కామేశ్వరి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దాపురం: భగత్‌సింగ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని సంఘ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. గోపాలకృష్ణ, అరుణ్‌కుమార్, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, డి.సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, అప్పన్న, నరసింహమూర్తి, గౌస్, నియాజ్, జగదీష్ ఉన్నారు.

పిఠాపురం: దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ నేటికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పలువురు వక్తలు అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవుల 93వ వర్ధంతి సందర్భంగా పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులో భగత్‌సింగ్ విగ్రహానికి సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, వీరబాబు, కరణం విశ్వనాథం, సత్యనారాయణ, సూర్యనారాయణ, వీరయ్య, శ్రీను, నూకరాజు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో భగత్‌సింగ్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొరకంటి తాతీలు, బోడపాటి విష్ణు, గుడాల సత్తిబాబు, దొండపాటి సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో ఐలాజ్ ప్రతినిధి బుగతా శివ, కమిటీ సభ్యులు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి ఐలాజ్ రాష్ట్ర నాయకుడు బుగతా శివ, నక్క హరిబాబు, ప్రజాసంఘాల నాయకులు కె.జనార్ధన్, కె.రత్నకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. లిబరేషన్ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి లిబరేషన్ పార్టీ నాయకులు ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు కాకర రత్నకుమారి నివాళులర్పించారు. సీఐటీయూ నేత రొంగల ఈశ్వరావు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు.

ఏలేశ్వరం: సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ఏలేశ్వరం వినోద్ మిత్రా నగర్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో కందుల ప్రసాద్, వొంతం రాజబాబు, అరజయ్య గుమ్మడి రాజు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట: రంగవల్లినగర్‌లో రైతు కూలీ సంఘం నేత కర్నాకుల వీరాంజనేయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుంచె అంజిబాబు, కడితే సతీష్, దేశెట్టి సురేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్ రాజ్‌గురుసుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా కొత్తపల్లి ఎస్‌సీపేటలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు వీరన్న, బల్లా సోమరాజు, సత్యం, చిట్టమ్మ, భూషణం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్‌తో కలిసి సీఐటీయూ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. 48 మంది రక్తదానం చేయగా వారికి డాక్టర్ కామరాజు ప్రశంసాపత్రాలను అందజేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సీఐటీయూ నాయకులు నాగమణి, ఎస్తేరురాణి, వరలక్ష్మీ పాల్గొన్నారు.

కాజులూరు: మండలంలోని కోలంక గ్రామంలో ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖదేవ్ వంటి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చల్లా సంతోష్‌కుమార్, కుంభత్తుల రమణ, మారెళ్ళ నరసింహమూర్తి, బండారు వీరబాబు, బూరెల చిన్న పెద్దిరెడ్డిరాజు, నందికోళ్ళ సత్తిబాబు, ఇళ్ళ బాబూరావు తదితరులున్నారు.

వైసీపీ అభ్యర్థి గీత ప్రచారానికి బ్రేక్

అడ్డుకున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు



పిఠాపురంలో ప్రచారాన్ని అడ్డుకుంటున్న అధికారులు

పిఠాపురం, మార్చి 23: పట్టణంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ఎన్నికల ప్రచారానికి బ్రేక్ పడింది. అనుమతులు లేవంటూ ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు అడ్డుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ ముందస్తుగానే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శనివారం పట్టణంలోని 2,3,4వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వారు ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ ఇన్‌చార్జి, ఎంఈవో ఆర్వీ ప్రసాద్ అక్కడకు చేరుకున్నారు. ప్రచారాన్ని వీడియో తీయించారు. అనంతరం అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రచారాన్ని నిలిపివేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి అనుమతులు అవసరమని, అవి లేకుండా చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనితో వైసీపీ అభ్యర్థి గీత తదితరులు ప్రచారాన్ని నిలిపివేసి వెనుతిరిగారు.

గాంధీ ఆశయాలను కొనసాగించాలి



గాంధీజీ చిత్రపటాలను చూపిస్తున్న రామకృష్ణ

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 23: విద్యార్థి దశనుంచే గాంధీజీ ఆశయాలను కొనసాగించాలని కాకినాడ గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (ఎంఎస్ఎన్ క్యాంపస్) విద్యార్థులు వెంకటరత్నపురంలోని గాంధీభవన్‌ను శనివారం సందర్శించారు. రామకృష్ణ మహాత్మాగాంధీ జీవితంలోని వివిధ ఘట్టాలను తెలిపే చిత్రపటాలను విద్యార్థులకు చూపించి సోదాహరణంగా వివరించారు. డాక్టర్ కె.జోసఫ్ స్టీఫెన్, డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ కేపీ స్వామీజీలతో పాటు పొలిటికల్ సైన్స్‌పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బోల్తా పడ్డ జామకాయల వ్యాన్




నీలాద్రిపేట వద్ద బోల్తా పడ్డ జామకాయల వ్యాన్

గండేపల్లి, మార్చి 23: మండలంలో నీలాద్రిపేట జాతీయ రహదారి వాటర్‌ట్యాంక్ జంక్షన్‌లో శనివారం చాగల్లు నుంచి శ్రీకాకుళం జామకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వ్యాన్ డ్రైవర్ నరసింహమూర్తి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వర్షపు చినుకులు పడడంతో వ్యాన్‌కంట్రోల్ అవ్వకపోవడంతో బోల్తా పడింది. హైవే మొబైల్ సిబ్బంది సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా బాధితుల్ని ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికల కోడ్ వర్తించదా?

గండేపల్లి, మార్చి 23: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులైనప్పటికీ మండలంలో ఇంకా వైసీపీ జెండా రంగులు కనిపిస్తున్నాయి. గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో వాటర్‌ట్యాంక్ వైసీపీ జెండా రంగులోనే ఉంది. దాని కింద ఉన్న శిలాఫలకంపై కూడా వైసీపీ నాయకులు బొమ్మలే ఉన్నాయి. అధికారులకు ఇవి కనిపించడంలేదా నిర్లక్ష్యధోరణిలో వదిలేస్తున్నారా అనేదిప్రశ్నార్థకంగా ఉంది.



రామేశ్వరంపేటలో వైసీపీ రంగులతో ఉన్న వాటర్‌ట్యాంక్

48గంటలలోపు అనుమతి తప్పనిసరి

కాకినాడ సిటీ ఆర్వో వెంకటరావు



కాకినాడలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 23: ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సభలు, సమావేశాలు, ర్యాలీలకు 48 గంటలలోపుగా అనుమతులు తీసుకోవాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఆర్వో జె.వెంకటరావు స్పష్టం చేశారు. కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో డీఎస్పీ హనుమంతరావుతో కలిసి శనివారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారంలో అవలంబించాల్సిన విధివిధానాలపై ఆర్వో సూచనలు ఇచ్చి నిబంధనలను తెలియజేశారు. ఒకేమార్గంలో ఒకేరోజు రెండు పార్టీలకు సంబంధించిన సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలకు దరఖాస్తు చేసుకోరాదని స్పష్టం చేశారు. అనుమతులకు దరఖాస్తు చేసుకునేముందు రూటు కచ్చితంగా తెలియజేయాలన్నారు. జెండాలు లేకుండా కర్రలు వినియోగించరాదన్నారు. సైలెన్సర్‌లేని, నెంబరు ప్లేట్లు లేని వాహనాలు వాడరాదన్నారు. సుంకర విద్యాసాగర్, ముమ్మిడి పవన్, రావూరి వెంకటేశ్వరరావు(వైసీపీ), గదుల సాయిబాబా(టీడీపీ), పలివెల వీరబాబు(సీపీఎం), అప్పారావు (బీఎస్పీ), నగరపాలకసంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎలక్షన్ డీటీ సీతాపతిరావు, డీసీపీ హరిదాసు ఉన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

కరప, మార్చి 23: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5ప్రత్యేక బృందాలతో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలుచేస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడా కోడ్ ఉల్లంఘన జరగకుండా ఈ టీమ్‌లు నిర్విరామంగా పనిచేస్తున్నాయన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ), ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్, వీడియో సర్వేలెన్స్ బృందాలు వాటికి నిర్దేశించిన కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయన్నారు. పలువురు సభ్యులతో కూడిన ఈ బృందాలు రాజకీయపార్టీలు నిర్వహించే ప్రచారాలు, ఎన్నికల ఖర్చు, నగదు, లిక్కర్, గిఫ్ట్‌ల పంపిణీ, తదితర అన్ని అంశాలను క్షుణ్ణంగా తనిఖీచేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలను సమర్పిస్తున్నాయన్నారు. ఎంసీసీ అధికారిగా ఎంపీడీవో, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారిగా ఎంఈవో పి.సత్యనారాయణ, ఎస్ఎస్‌టీ అధికారిగా మండల ఇంజనీరింగ్ అధికారి గంద్రేటి శైలజ, వీవీటీ అధికారిగా హౌసింగ్ ఏఈ టీవీ నాగభూషణం, వీఎస్‌టీ అధికారిగా కరప హౌసింగ్ ఏఈ సుంకర రాంబాబు బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు.

విధుల నిర్వహణలో అప్రమత్తం

గొల్లప్రోలు రూరల్, మార్చి 23: ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కుడా వైస్ చైర్మన్ కృష్ణమూర్తి సూచించారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో శనివారం పట్టణ, మండల పరిధిలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు వచ్చే ఉత్తర్వులు, ఆదేశాలు, నియమావళిని పాటించాలన్నారు. గొల్లప్రోలు తహశీల్దార్ ఉదయభాస్కర్, నగర పంచాయతీ కమిషనరు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోండి

ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు



ప్రత్తిపాడు: పోతులూరులో ప్రసంగిస్తున్న సీఐ

ప్రత్తిపాడు, మార్చి 23: జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కోరారు. మండలంలోని పోతులూరు, వాకపల్లి, తోటపల్లి, వెంకటనగరం గ్రామాల్లో శనివారం కేంద్ర రక్షణ బలగాలతో సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ బృందం కవాతు నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

'ఎటువంటి ఘర్షణలకు వెళ్లొద్దు'

గండేపల్లి, మార్చి 23: ఎన్నికలు దగ్గర పడడంతో గ్రామాల్లో ఎక్కడ ఎటువంటి ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు అన్నారు. మండలంలో మల్లేపల్లి నీలికుండీలపేటకాలనీలో గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా సీఐ హాజరయ్యారు. సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దిగరాదన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, ప్రజలు సహకరిస్తే శాంతిభద్రతల నడుమ జరుగుతాయన్నారు. 2019 ఎన్నికల్లో కేసుల్లో ఇరుకున్న వారందరినీ బైండోవర్ చేస్తామన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం'

కొరుపల్లి (కరప), మార్చి 23: కూటమి ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి స్పష్టంచేశారు. కరపమండలం కొరుపల్లి గ్రామంలో శనివారం జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో కలిసి వారు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. మాట్లాడుతూ జగన్ పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతిపాలైందని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా, యువత ఉద్యోగ అవకాశాలు పొందాలన్నా, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభ్యున్నతి చెందాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి వచ్చే ఎన్నికల్లో నానాజీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి, కోటగిరి మహేంద్రబాబు, రెడ్డి వీరవెంకటసత్యనారాయణ, దేవిశెట్టి చంద్రశేఖర్, రెడ్డి రాజు, దేవిశెట్టి నాని, బండారు మురళి, ముద్రగడ రమేష్, మద్దూరి స్వామి, ముత్యాలరావు, టేకి విష్ణు, పట్టాభి, పాట్నీడి రాంబాబు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మి

వైభవంగా ఊంజల్‌సేవ



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామికి ఊంజల్‌సేవ

పిఠాపురం, మార్చి 23: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాల సేవ, చతుస్థానార్చనము, స్నపన తిరుమంజనం జరిగాయి. అనంతరం స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన వేదికపై ఊంజల్‌సేవ జరిపించారు. ఆలయ వేదపండితులు పి.రామకృష్ణాచార్యులు, నరసింహాచార్యులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, టీటీడీ డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఆలయ అధికారి సందీప్ తదితరులు ఉన్నారు.


నూకాలమ్మ ప్రతిష్ఠా మహోత్సవాలు

పిఠాపురం, మార్చి 23: పట్టణంలోని పెద్దబజారులో పునర్నిర్మించిన నూకాలమ్మ తల్లి ఆలయలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, దీక్షాదారణ, ప్రతిష్ఠా సంకల్పం, మండపారాధన, శీతలా మంత్రజపం, దుర్గా, శ్రీ సూక్త పారాయణలు, జలాధివాసం, అగ్నిమథనం, క్షీరాధివాసము, మండప పూజలు, వేదపారాయణ, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, బలిహరణ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో సదస్యం

ప్రత్తిపాడు, మార్చి 23: మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల సదస్యం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా నిత్యహోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు చేపట్టారు. స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన అర్చకులు ఎ.లక్ష్మినరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సదస్యం సందర్భంగా భజన కళాకారులు సానా తాతీలు ఏకాహం నిర్వహించారు.

అచ్చెన్నాయుడును కలిసిన సత్యప్రభ



అచ్చెన్నాయుడుకు బొకే అందజేస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 23: ఎన్నికల వ్యూహంలో భాగంగా టీడీపీ అభ్యర్థులకు విజయవాడ ఏ వన్‌కన్వెషన్ హాల్లో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌కు ప్రత్తిపాడు, తుని అభ్యర్థులు వరుపుల సత్యప్రభ, యనమల దివ్య హాజరయ్యారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సత్యప్రభ బొకే అందజేశారు. ఎన్నికల సమరంలో అనుసరించాల్సిన పద్ధతులు, పలు అంశాలను ఈ సందర్భంగా అచ్చెంనాయుడు సత్యప్రభకు వివరించారు.

టీడీపీ నేతలను కలిసిన కొండబాబు



అచ్చెన్నాయుడుతో కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 23: విజయవాడలో శనివారం జరిగిన టీడీపీ అభ్యర్థుల రాష్ట్రవ్యాప్త వర్క్‌షాప్‌లో పాల్గొన్న కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు టీడీపీ సీనియర్ నేతలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కొండబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

జగ్గంపేట, మార్చి 23: జగ్గంపేటకి చెందిన పారిశ్రామికవేత్త, కర్రి రామచంద్రరెడ్డి (శ్రీనివాస రెడ్డి) తన తల్లి జయలక్ష్మి పేరిట మల్లంపూడిలోని శ్రీ సాయిబాబా వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారిశెట్టి గణేష్, ఆత్మకూరి ప్రసాద్ తదితరులున్నారు.

వైసీపీకి రాజీనామా

కాజులూరు, మార్చి 23: మండలం ఆర్యవటం గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది కొప్పిశెట్టి వీరభద్రరావు శనివారం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీలో తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో పార్టీని వీడుతున్నానని, త్వరలో టీడీపీలో చేరతానన్నారు.